02-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎప్పటికప్పుడు జ్ఞానసాగరుని వద్దకు రండి, జ్ఞాన రత్నాల సామానును నింపుకొని మళ్ళీ బయటకు వెళ్ళి డెలివరీ చేయండి, విచార సాగర మంథనము చేసి సేవలో నిమగ్నమైపోండి"

ప్రశ్న:- అన్నింటికన్నా మంచి పురుషార్థము ఏమిటి? తండ్రికి ఏ పిల్లలు ప్రియమనిపిస్తారు?

జవాబు:- ఎవరి జీవితాన్ని అయినా తీర్చిదిద్దడము అనేది చాలా మంచి పురుషార్థము. పిల్లలు ఈ పురుషార్థములోనే నిమగ్నమైపోవాలి. ఎప్పుడైనా, ఏదైనా పొరపాటు జరిగినట్లయితే, దానికి రిటర్నులో బాగా సేవను చేయండి, లేదంటే ఆ పొరపాటు మనస్సును తింటూ ఉంటుంది. తండ్రికి జ్ఞానీ మరియు యోగీ పిల్లలే చాలా ప్రియమనిపిస్తారు.

పాట:- ఎవరైతే తండ్రితోపాటు ఉంటారో... (జో పియా కే సాథ్ హై...)

ఓం శాంతి. సమ్ముఖముగా మురళి వినడానికి మరియు టేప్ ద్వారా వినడానికి మరియు కాగితము మీద చదవడానికి తేడా తప్పకుండా ఉంటుందని పిల్లలు అర్థం చేసుకోగలరు. పాటలో కూడా - ఎవరైతే తండ్రితోపాటు ఉంటారో, వారి కొరకు జ్ఞాన వర్షము కురుస్తుంది అని అంటారు. వర్షమైతే అందరి కొరకు ఉంటుంది, కానీ కలిసి ఉండడం వలన తండ్రి యొక్క హావభావాలను అర్థం చేసుకోవడంలో, భిన్న-భిన్న డైరెక్షన్లను తెలుసుకోవడంలో ఎంతో లాభం ఉంటుంది. అలాగని ఎవరైనా ఇక్కడే కూర్చుండిపోవడం కాదు. సామానును నింపుకోవాలి, వెళ్ళి సేవ చేయాలి, మళ్ళీ వచ్చి సామానును నింపుకోవాలి. మనుష్యులు అమ్మడానికే సామాను ఖరీదు చేస్తారు. అమ్మిన తర్వాత మళ్ళీ సామాను కొనడానికి వస్తారు. ఇది కూడా జ్ఞాన రత్నాల సామాను. సామాను తీసుకునేవారైతే వస్తారు కదా. కొందరు డెలివరీ చేయరు, పాత సామానుతోనే ఉంటారు, కొత్తదానిని తీసుకోవాలని అనుకోరు. ఇటువంటి అవివేకులు కూడా ఉన్నారు. మనుష్యులే తీర్థ స్థానాలకు వెళ్తారు, అంతేకానీ తీర్థ స్థానాలైతే రావు కదా, ఎందుకంటే అవి జడ చిత్రాలు. ఈ విషయాల గురించి పిల్లలకే తెలుసు. మనుష్యులకైతే ఏమీ తెలియదు. చాలా గొప్ప-గొప్ప గురువులు, శ్రీశ్రీ మహా మండలేశ్వరులు మొదలైనవారు జిజ్ఞాసువులను తీర్థ యాత్రలకు తీసుకువెళ్తారు, త్రివేణీ వద్దకు ఎంతమంది వెళ్తారు. నదుల వద్దకు వెళ్ళి దానం చేయడానిని పుణ్యమని భావిస్తారు. ఇక్కడ భక్తి యొక్క విషయమే లేదు. ఇక్కడైతే తండ్రి వద్దకు రావాలి, కావున పిల్లలు అర్థం చేసుకొని తర్వాత అర్థం చేయించాలి. ప్రదర్శనిలో కూడా మనుష్యులకు అర్థం చేయించాలి. ఈ 84 జన్మల చక్రమునేదైతే తిరుగుతారో, ఇలా అందరూ తిరగలేరని పిల్లలకు తెలుసు. ఇందులో అర్థం చేయించేందుకు చాలా మంచి యుక్తి కావాలి. ఈ చక్రము విషయములోనే మనుష్యులు తికమకపడతారు. వృక్షము గురించైతే ఎవరికీ తెలియనే తెలియదు. శాస్త్రాలలో కూడా చక్రాన్ని చూపిస్తారు. కల్పము యొక్క ఆయువును చక్రము ద్వారా తెలుసుకుంటారు. చక్రములోనే తికమక ఉంది, మనమైతే పూర్తి చక్రము చుడతాము. 84 జన్మలు తీసుకుంటాము, ఇకపోతే ఇస్లాములు, బౌద్ధులు మొదలైనవారైతే తర్వాత వస్తారు. మనం ఆ చక్రములో సతో, రజో, తమోలను ఏ విధముగా దాటుతాము అనేది ఆ సృష్టి చక్రములో చూపించడం జరిగింది. ఇక మిగిలిన ఇస్లాములు, బౌద్ధులు మొదలైనవారెవరైతే వస్తారో వారిని ఏ విధంగా చూపించాలి? వారు కూడా సతో, రజో, తమోలలోకి వస్తారు. మనము మన విరాట రూపాన్ని కూడా చూపిస్తాము - సత్యయుగము నుండి మొదలుకొని కలియుగము వరకూ పూర్తిగా చుట్టి వస్తాము. పిలక బ్రాహ్మణులది, ఆ తర్వాత ముఖాన్ని సత్యయుగములో, బాహువులను త్రేతాలో, కడుపును ద్వాపరములో, ఆ తర్వాత కాళ్ళను చివర్లో నిలబెట్టాలి. మన విషయములో విరాట రూపాన్ని చూపించాలి. మరి ఇతర ధర్మాలవారిని ఎలా చూపించాలి? వారిని కూడా ప్రారంభంలో సతోప్రధానముగా, ఆ తర్వాత సతో, రజో, తమోగా చూపించాలి. తద్వారా ఎప్పుడూ ఎవ్వరూ నిర్వాణములోకి వెళ్ళలేదని నిరూపించబడుతుంది. వారైతే ఈ చక్రములోకి వచ్చేదే ఉంది. ప్రతి ఒక్కరూ సతో, రజో, తమోలలోకి రావాల్సిందే. ఇబ్రహీం, బుద్ధుడు, క్రైస్ట్ మొదలైనవారు కూడా మనుష్యులే. రాత్రి సమయంలో బాబాకు ఎన్నో ఆలోచనలు నడుస్తాయి. ఆ ఆలోచనలలో నిద్ర యొక్క నషా ఎగిరిపోతుంది, నిద్ర తేలిపోతుంది. అర్థం చేయించేందుకు చాలా మంచి యుక్తి కావాలి. వారి విరాట రూపాన్ని కూడా తయారుచేయవలసి ఉంటుంది. వారి కాళ్ళను కూడా చివరలో చూపించాలి, ఆ తర్వాత లిఖిత పూర్వకంగా అర్థం చేయించాలి. క్రైస్టు వచ్చినప్పుడు వారు కూడా సతో, రజో, తమోలను దాటాల్సి ఉంటుంది అని పిల్లలు అర్థం చేయించాలి. సత్యయుగములోకైతే వారు రానే రారు. ఆ తర్వాతే వారు రావాల్సి ఉంటుంది. క్రైస్టు స్వర్గములోకి రారు అని అంటారు! ఇది తయారై-తయారుచేయబడిన ఆట. క్రైస్టుకు ముందు కూడా ధర్మాలు ఉండేవి, మళ్ళీ అవే రిపీట్

అవుతాయని మీకు తెలుసు. డ్రామా రహస్యాన్ని అర్థం చేయించాల్సి ఉంటుంది. మొట్ట-మొదటైతే తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి. తండ్రి నుండి క్షణములో వారసత్వమనేది ఏ విధముగా లభిస్తుంది? క్షణములో జీవన్ముక్తి అని అంటూ ఉంటారు. చూడండి, బాబాకు ఎన్ని ఆలోచనలు నడుస్తాయి. బాబాకు విచార సాగర మంథనము చేసే పాత్ర ఉంది. ఈశ్వరీయ జన్మ సిద్ధ అధికారము, ఇప్పుడు లేకుంటే మరెప్పుడూ లేదు (''నౌ ఆర్ నెవర్'') అన్న పదాలు రాసి ఉన్నాయి. జీవన్ముక్తి అన్న పదాన్ని వ్రాయాలి. వివరణ స్పష్టముగా వ్రాసి ఉన్నట్లయితే అర్థం చేయించడము సహజమవుతుంది. జీవన్ముక్తి వారసత్వము లభిస్తుంది. జీవన్ముక్తిలో రాజు, రాణి, ప్రజలు అందరూ ఉన్నారు. కావున వ్రాసిన వివరణను కూడా సరిదిద్దాల్సి ఉంటుంది. చిత్రాలు లేకుండా కూడా అర్థం చేయించవచ్చు. అలాగే, వీరు బాబా, ఇది వారసత్వము - అని కేవలం సైగల ద్వారా కూడా అర్థం చేయించవచ్చు. ఎవరైతే యోగయుక్తముగా ఉంటారో వారు మంచి రీతిలో అర్థం చేయించగలుగుతారు. మొత్తం ఆధారమంతా యోగముపైనే ఉంది. యోగము ద్వారా బుద్ధి పవిత్రముగా అవుతుంది, అప్పుడే ధారణ జరుగగలదు. ఇందులో దేహీ-అభిమాని అవస్థ కావాలి, అన్నింటినీ మర్చిపోవాల్సి ఉంటుంది. శరీరాన్ని కూడా మర్చిపోవాలి. ఇప్పుడిక మనం తిరిగి వెళ్ళాలి, ఈ ప్రపంచమైతే అంతమవ్వనున్నది. ఈ బాబా కొరకైతే సహజము, ఎందుకంటే వీరి వ్యాపారమే ఇది. రోజంతా బుద్ధి ఈ విషయాలలోనే నిమగ్నమై ఉంటుంది. అచ్ఛా! ఎవరైతే గృహస్థ వ్యవహారములో ఉంటారో, వారైతే కర్మలు చేయాల్సి ఉంటుంది. స్థూల కర్మలు చేయడం వలన ఆ విషయాలను మర్చిపోతారు, బాబా స్మృతిని మర్చిపోతారు. బాబా స్వయం తమ అనుభవాన్ని వినిపిస్తారు. బాబాను స్మృతి చేస్తాను - బాబా ఈ రథానికి తినిపిస్తున్నారు అని భావిస్తాను, మళ్ళీ మర్చిపోతాను, అప్పుడు బాబా ఆలోచిస్తారు - నేను కూడా మర్చిపోతున్నానంటే మరి పాపం వీళ్ళకు ఎంత కష్టముగా ఉండి ఉండవచ్చు. ఈ చార్ట్ ను ఏ విధంగా పెంచగలరు? ప్రవృత్తి మార్గం వారికి ఇది కష్టము, వారు శ్రమించాల్సి ఉంటుంది. బాబా అయితే అందరికీ అర్థం చేయిస్తారు. ఎవరైతే పురుషార్థం చేస్తున్నారో, వారు రిజల్టును వ్రాసి పంపవచ్చు. తప్పకుండా ఇది కష్టమేనని బాబాకు తెలుసు. బాబా అంటారు - రాత్రి సమయంలో కష్టపడండి, ఒకవేళ మీరు యోగయుక్తులుగా అయి విచార సాగర మంథనము చేస్తూ ఉన్నట్లయితే మీ అలసటంతా దూరమైపోతుంది. బాబా తమ అనుభవాన్ని తెలియజేస్తారు - ఎప్పుడైనా ఇతర విషయాల వైపుకు బుద్ధి వెళ్ళినట్లయితే తల వేడెక్కిపోతుంది, మళ్ళీ ఆ తుఫానుల నుండి బుద్ధిని తొలగించి ఈ విచార సాగర మంథనములో నిమగ్నమైపోయానంటే బుద్ధి తేలికగా అయిపోతుంది. మాయా తుఫానులైతే అనేక రకాలుగా వస్తాయి. బుద్ధిని ఇటువైపు జోడించడం ద్వారా ఆ అలసటంతా దూరమైపోతుంది, బుద్ధి రిఫ్రెష్ అయిపోతుంది. బాబా సేవలో నిమగ్నమైపోతే యోగము మరియు జ్ఞానమనే వెన్న లభిస్తుంది. ఈ బాబా తమ అనుభవాన్ని తెలియజేస్తున్నారు. తండ్రి అయితే పిల్లలకు తెలియజేస్తారు కదా - ఇలా, ఇలా జరుగుతుంది, మాయ వికల్పాలు వస్తాయి అని. బుద్ధిని మళ్ళీ అటువైపు జోడించాల్సి ఉంటుంది. చిత్రాలను తీసుకొని వాటి గురించే ఆలోచించినట్లయితే, మాయా తుఫానులు దూరమైపోతాయి. బాబాకు తెలుసు - మాయ ఎటువంటిదంటే అది స్మృతిలో కూర్చోనివ్వదు. పూర్తిగా స్మృతిలో ఉండేవారు కొద్దిమందే ఉన్నారు. పెద్ద-పెద్ద విషయాలనైతే చాలామంది మాట్లాడుతారు. ఒకవేళ బాబా స్మృతిలో ఉన్నట్లయితే బుద్ధి క్లియర్ గా ఉంటుంది. స్మృతి చేయడం వంటి వెన్న ఇంకేదీ ఉండదు. కాకపోతే స్థూలమైన భారము ఎక్కువగా ఉండడం వలన స్మృతి తగ్గిపోతుంది.

చూడండి, బొంబాయికు పోప్ వచ్చారు, అతనికి ఎంత మహిమ జరిగింది, అందరి భగవంతుడు వచ్చినట్లుగా భావించారు. అతను శక్తివంతుడు కదా. భారతవాసులకు తమ ధర్మము గురించి తెలియదు. తమది హిందూ ధర్మము అని చెప్పుకుంటూ ఉంటారు. హిందూ అనే ధర్మమే లేదు. ఎక్కడి నుండి వచ్చింది, ఎప్పుడు స్థాపనయ్యింది అన్నది ఎవరికీ తెలియదు. మీలో జ్ఞానము విషయములో ఉత్సాహము ఉండాలి. శివశక్తులు జ్ఞానము విషయములో ఉత్సాహముతో ఉండాలి. వారైతే శక్తులను సింహంపై చూపించారు. నిజానికి ఇది జ్ఞానానికి సంబంధించిన విషయము. చివర్లో ఎప్పుడైతే మీలో శక్తి వస్తుందో, అప్పుడు సాధు-సన్యాసులు మొదలైనవారికి కూడా అర్థం చేయిస్తారు. ఇంతటి జ్ఞానం బుద్ధిలో ఉన్నప్పుడే ఉత్సాహం కలుగగలదు. ఏ విధంగానైతే చక్రాతా గ్రామంలో వ్యవసాయం చేసుకునేవారికి టీచర్ చదివించినా కానీ వారు చదవరు. వారికి వ్యవసాయమే బాగా అనిపిస్తుంది. అలాగే ఈ నాటి మనుష్యులకు ఈ జ్ఞానాన్ని ఇచ్చినట్లయితే - వారు అంటారు - మాకు ఇది నచ్చదు, మేమైతే శాస్త్రాలను చదువుతాము. కానీ భగవంతుడు స్పష్టంగా చెప్తారు - జప, తప, దాన, పుణ్యాదులు చేయడం ద్వారా లేక శాస్త్రాలను చదవడం ద్వారా నన్ను ఎవ్వరూ పొందలేరు. వారికి డ్రామా గురించి తెలియదు. నాటకములో పాత్రధారులు పాత్రను అభినయించేందుకు ఈ వస్త్రాన్ని తీసుకున్నారు అన్నది వారికి తెలియదు. ఇది ఉన్నదే ముళ్ళ అడవి. ఒకరికొకరు ముళ్ళు గుచ్చుకుంటూ, దోచుకుంటూ-కొట్లాడుకుంటూ ఉంటారు. ముఖము మనుష్యులదే కానీ గుణము కోతిలా ఉంది. తండ్రి కూర్చొని

పిల్లలకు అర్థం చేయిస్తారు. ఎవరైనా కొత్తవారు వింటే వేడెక్కిపోతారు. పిల్లలేమైనా వేడెక్కుతారా. తండ్రి అంటారు - నేను పిల్లలకే అర్థం చేయిస్తాను. పిల్లలను తల్లి-తండ్రులు ఏమైనా అనవచ్చు. పిల్లలకు తండ్రి చెంపదెబ్బ వేసినా కానీ ఇతరులు ఏమైనా చేయగలరా. పిల్లలను తీర్చిదిద్దడం తల్లి-తండ్రుల కర్తవ్యము. కానీ, ఇక్కడ ఆ నియమం లేదు. నేను ఎటువంటి కర్మలను చేస్తానో, నన్ను చూసి ఇతరులు కూడా చేస్తారు. కావున బాబా ఏదైతే విచార సాగర మంథనము చేసారో, దానిని కూడా తెలియజేసారు. వీరు మొదటి నంబరులో ఉన్నారు, వీరు 84 జన్మలు తీసుకోవలసి ఉంటుంది. మరి అటువంటప్పుడు ఇతర ధర్మ స్థాపకులెవరైతే ఉన్నారో వారు నిర్వాణములోకి ఎలా వెళ్తారు. వారు సతో, రజో, తమోలలోకి తప్పకుండా రావాలి. మొదటి నంబరులో లక్ష్మి-నారాయణులు ఉన్నారు, వారు విశ్వాధిపతులు. వారు కూడా 84 జన్మలు తీసుకోవాల్సి ఉంటుంది. మనుష్య సృష్టిలో అతి ఉన్నతమైన కొత్త మానవుడు ఎవరైతే ఉన్నారో వారితోపాటు కొత్త స్త్రీ కూడా కావాలి, లేకపోతే స్త్రీ లేకుండా సంతానము ఎలా కలుగుతుంది. సత్యయుగములో కొత్త మానవులు ఈ లక్ష్మీ-నారాయణులు. పాతవారి నుండి కొత్తవారిగా అవుతారు. వీరు ఆల్రౌండ్ పాత్రధారులు. మిగిలినవారంతా కూడా సతో నుండి తమోలోకి వస్తారు, పాతవారిగా అవుతారు, మళ్ళీ పాతవారి నుండి కొత్తవారిగా అవుతారు. ఏ విధంగానైతే క్రైస్టు మొదట కొత్తగా వచ్చారు, ఆ తర్వాత పాతగా అయ్యి వెళ్ళారు, మళ్ళీ కొత్తగా అయ్యి తమ సమయానికి వస్తారు. ఇది బాగా అర్థం చేసుకోవలసిన విషయము. ఇందులో యోగము బాగుండాలి. పూర్తిగా సమర్పితమవ్వాలి కూడా, అప్పుడే వారసత్వానికి హక్కుదారులుగా అవ్వగలరు. సరెండర్ అయినట్లయితే ఇలా, ఇలా చేయండి అని బాబా డైరెక్షన్లు కూడా ఇవ్వగలుగుతారు. కొందరు సరెండర్ అయి ఉన్నవారికి వ్యవహారములో కూడా ఉండమని చెప్తారు, అప్పుడు బుద్ధి గురించి తెలుస్తుంది అని అలా చెప్తారు. వ్యవహారములో ఉంటూ జ్ఞానాన్ని తీసుకోండి, పాస్ అయి చూపించండి. గృహస్థములోకి వెళ్ళకూడదు. బ్రహ్మచారులుగా అయి ఉండడం మంచిది. బాబా ప్రతి ఒక్కరి లెక్కలను కూడా అడుగుతారు. మమ్మా, బాబాల పాలన తీసుకున్నప్పుడు మరి ఆ ఋణాన్ని కూడా తీర్చుకోవాలి, అప్పుడే బలము లభిస్తుంది. లేకపోతే తండ్రి కూడా అంటారు - నేను ఇంతగా కష్టపడి పాలన చేసాను, అయినా నన్ను వదిలేసారు. ప్రతి ఒక్కరి నాడిని చూడాల్సి ఉంటుంది, తద్వారా డైరెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది. ఒకవేళ వీరి ద్వారా ఏదైనా పొరపాటు జరిగితే, తండ్రి వీరిని నిర్దోషిగా చేసి, సరి చేస్తారు. వీరు కూడా అడుగడుగులోనూ శ్రీమతముపై నడుస్తూ ఉంటారు. ఎప్పుడైనా నష్టం కలిగితే డ్రామాలో ఉందని భావిస్తారు. మున్ముందు మళ్ళీ అటువంటి విషయము జరుగకూడదు. పొరపాటు చేసినట్లయితే అది తమ మనస్సును తింటుంది. పొరపాటు చేస్తే దానికి రిటర్న్లో చాలా సేవలో నిమగ్నమైపోవాలి, పురుషార్థం ఎంతగానో చేయాలి. ఎవరి జీవితాన్ని అయినా తీర్చిదిద్దడము - ఇదే పురుషార్థము.

బాబా అంటారు - నాకు యోగి మరియు జ్ఞానీ పిల్లలు అందరికన్నా ప్రియమైనవారు. యోగములో ఉంటూ భోజనము తయారుచేసి తినిపించినట్లయితే ఎంతో ఉన్నతి జరుగగలదు. ఇది శివబాబా భండారా. కావున శివబాబా పిల్లలు తప్పకుండా ఇలా యోగయుక్తముగా ఉంటారు. మెల్ల-మెల్లగా అవస్థ ఉన్నతముగా అవుతుంది. సమయం తప్పకుండా పడుతుంది. ప్రతి ఒక్కరి కర్మబంధనాలు ఎవరివి వారివే. కన్యలపై ఎటువంటి భారమూ లేదు. కొడుకులపై ఉంటుంది. పిల్లలు పెద్దవారైతే తల్లిదండ్రులపై భారము పడుతుంది. తండ్రి ఇంతగా అర్థం చేయించారు, ఇంత సమయం పాలన చేసారు కావున వారి పాలన చేయవలసి ఉంటుంది. లెక్కను తీర్చినట్లయితే వారి మనస్సు కూడా సంతోషపడుతుంది. సుపుత్రులైన పిల్లలెవరైతే ఉంటారో, వారు యాత్రల నుండి తిరిగి వచ్చినప్పుడు అంతా తండ్రి ముందు ఉంచుతారు. ఋణం తీర్చాలి కదా. ఇవి బాగా అర్థం చేసుకోవాల్సిన విషయాలు. ఉన్నత పదవిని పొందేవారే సింహం వలె ఉత్సాహంతో ఎగురుతూ ఉంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. యోగములో ఉంటూ భోజనాన్ని తయారుచేయాలి. యోగములో ఉంటూనే భోజనాన్ని తినాలి మరియు తినిపించాలి.

2. బాబా ఏదైతే అర్థం చేయించారో, దానిపై మంచి రీతిలో విచార సాగర మంథనము చేసి యోగయుక్తులుగా అయి ఇతరులకు కూడా అర్థం చేయించాలి.

వరదానము:- స్వ పరివర్తన మరియు విశ్వ పరివర్తన యొక్క బాధ్యతా కిరీటధారి నుండి విశ్వ రాజ్య కిరీటధారి భవ

ఏ విధముగా తండ్రిపై మరియు ప్రాప్తులపై ప్రతి ఒక్కరూ తమకు అధికారముందని భావిస్తారో, అలా స్వ పరివర్తన మరియు విశ్వ పరివర్తన, ఈ రెండు బాధ్యతల కిరీటధారిగా అవ్వండి, అప్పుడు విశ్వ రాజ్య కిరీటధారిగా అవుతారు. వర్తమానమే భవిష్యత్తుకు ఆధారము. చెక్ చేసుకోండి మరియు జ్ఞానమనే దర్పణములో చూసుకోండి - బ్రాహ్మణ జీవితములో పవిత్రత యొక్క, చదువు మరియు సేవ యొక్క డబల్ కిరీటము ఉందా? ఒకవేళ ఇక్కడ ఏ కిరీటము అయినా అసంపూర్ణముగా ఉన్నట్లయితే, అక్కడ కూడా చిన్న కిరీటానికి అధికారులుగా అవుతారు.

స్లోగన్:- సదా బాప్ దాదా యొక్క ఛత్రఛాయ లోపల ఉన్నట్లయితే విఘ్న వినాశకులుగా అవుతారు.